జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
ఆదివారం | 26 | జులై | 2026 ◆ పేజీలు : 6



# సీతారామ పనుల్లో వేగం పెంచండి

- అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం



**కల్లూరు, జులై 25 : ప్రజాజ్యోతి** సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపి) పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవిన్యూ, నీటిపారుదల (ఇరిగేషన్), అటవీ శాఖల అధికారులతో ప్రాజెక్టు పురోగతిని ఆయన సమీక్షించారు. ప్రాజెక్ట్ పరిధిలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ భూ యజమానులకు పరిహారం చెల్లింపుల పురోగతిని సబ్ కలెక్టర్ వివరంగా అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తిచేసి

మిగతా 2 లో...



# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- నాణ్యమైన పట్టు ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- నా పట్టు - నా అభిమానం కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు.శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన నా పట్టు – నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పట్టుపరిశ్రమ రైతులతో ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, ఖర్చు, నీటి వినియోగం, రాబడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు.తెలంగాణలో పట్టుపరిశ్రమ అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.పట్టుపరిశ్రమ కు నీటి వినియోగం చాలా తక్కువని,రిస్క్ కూడా తక్కువని, రాబడి ఎక్కువగా

మిగతా 2 లో...

# సోలార్ పంప్ సెట్ తో ఎన్నో లాభాలు



- సోలార్ ఉచిత విద్యుత్ తో పాటు అదనపు ఆదాయం
- రెడ్ కో వైస్ చైర్మన్ ఎండి ముషారఫ్ ఫరూఖి
- మండలంలో సోలార్ పంప్ సెట్ పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్, రెడ్కో వైస్ చైర్మన్ ముషారఫ్ ఫరూఖి , టి జి ఎన్ పి డి సి ఎల్ సిఎండి వరుణ్ రెడ్డి

**బోనకల్, జులై 25 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ పనితీరును శనివారం రైతు డిస్కం , రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నేరుగా రైతుతో మాట్లాడుతూ పనితీరును తెలుసుకొని సోలార్ పంప్ సెట్ వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అంటూ రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు మాట్లాడుతూ... చాలా సంతోషంగా ఉందని వ్యక్తం చేస్తూ అనంతరం రావినూతల గ్రామంలో ఇంటిపై

మిగతా 2 లో...

# టీజీఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు పూల మొక్కలు అందించి, కలెక్టరేట్ కు ఆహ్వానించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** రైతు డిస్కం, రెడ్ కో వైస్ చైర్మన్అండ్ ఎండి ముషారఫ్ ఫారూఖి, టిజి ఎన్పిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్ రెడ్డి లు ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వారికి ఘన స్వాగతం పలికారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిబింబించేలా పూల మొక్కలను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ,ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చేపడుతున్న చర్యలు, విద్యుత్ మౌళిక సదుపాయాల బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంపై సంక్షిప్తంగా వివరించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు టీజీఎన్పీడీసీఎల్ అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. ముషారఫ్ ఫారూఖి, కర్ణాటి వరుణ్ రెడ్డి లు జిల్లా యంత్రాంగం చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు సంస్థ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించడం, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# 11 కెవి విద్యుత్ తీగలకు టిప్పర్ తగిలి డ్రైవర్ దుర్మరణం

- మట్టిలోడు దింపుతుండగా విషాదం పెద్ద కోరుకొండి గ్రామంలో విషాద ఛాయలు



**కల్లూరు, జులై 26: ప్రజా జ్యోతి** టిప్పర్ లారీ హైడ్రాలిక్ 11 కెవి విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై డ్రైవర్ అక్కడే మృతి చెందిన విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడు కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన మేకల కిరణ్ 36గా గుర్తించారు. కుటుంబ సభ్యులు స్థానికుల వివరాల ప్రకారం వెన్నవల్లి గుట్ట ప్రాంతం నుంచి టిప్పర్ లారీలో మట్టిని తరలిస్తున్న కిరణ్ మునకుళ్ల గ్రామంలో మట్టి లోడును దింపుతున్న సమయంలో టిప్పర్ హైడ్రాలిక్ పైకి లేవడంతో సమీపంలోని 11 కెవి విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్ ఘాతానికి గురైన కిరణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కిరణ్ కు భార్య ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కిరణ్ ఆకస్మిక మృతితో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది పెద్ద కోరుకొండి గ్రామంలోని ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త మృతదేహాన్ని చూసి భార్య కన్నీరు మున్నీరుగా విలపించగా ఆమెను ఓదార్చడం అక్కడున్న వారి వల్ల కాలేదు గ్రామస్తులు కూడా ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సర్పంచ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మృతుడి భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు లోనే ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

(మొదటి పేజీ తరువాయి...)
ఉంటుందని కలెక్టర్ అన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. సబ్సిడీ పెంపు విషయమై ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ సమర్పిస్తామని, ప్రస్తుతానికి సబ్సిడీ తో పాటు లబ్ధిదారులు కొంత భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. ఒక్కో రైతు విడివిడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేస్తే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు.కేంద్ర పట్టు బోర్డు,బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా. జి. సుబ్రహ్మణ్యం కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు.పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి, ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.సమావేశంలో జిల్లా లో పట్టు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో నిర్వహించిన బేస్‌లైన్ సర్వే వివరాలను సమీక్షించి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ,నాణ్యమైన పట్టు ఉత్పత్తి,ప్రభుత్వ పథకాల సమర్థ అమలు,సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు,ఇతర భాగ స్వామ్యులు, త దిత రులు పాల్గొన్నారు.

## సీతారామ పనుల్లో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి...)
పరిహారం పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఇరిగేషన్ అటవీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్ లో ఉన్న క్లియరెన్స్ లు భూ పరిశీలన నివేదికలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను సానుభూతితో పరిశీలించి. వారికి చెల్లించాల్సిన పరిహారం ఆలస్యం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థానికంగా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువల నిర్మాణ పనులు నిర్దేశిత కాల పరిమితిలో పూర్తయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇరిగేషన్ అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సోలార్ పంప్ సెట్ తో ఎన్నో లాభాలు



(మొదటి పేజీ తరువాయి...)
ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ పనితీరును నేరుగా లబ్ధిదారుని తో మాట్లాడి ఉచిత విద్యుత్ తో పాటు అదనపు ఆదాయం సమకూరుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వలన చాలా సంతోషముగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్కో ఉన్నతాధికారులు, ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి, పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, రావినూతల గ్రామ సర్పంచ్ భూక్య బద్రునాయక్, మండల కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల రైతులు, మండల వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన కొండపల్లి బ్రదర్స్



**కల్లూరు, జులై 25 : ప్రజా జ్యోతి** మండల పరిధిలోని ముగ్గు వెంకటాపురం గ్రామపంచాయతీ లో మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాసరావు (వాసు) జన్మదినాన్ని పురస్కరించుకుని కొండపల్లి బ్రదర్స్ దాతృత్వాన్ని చాటుకున్నారు.

గ్రామ ప్రజలు భక్తుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముగ్గు వెంకటాపురం గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలో తిరువూరు వెళ్లే ప్రధాన రహదారి వద్ద ఉన్న రామాలయం ప్రాంగణంలో సొంత నిధులతో రెండు చేతి బోర్లను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కొండపల్లి బ్రదర్స్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా జన్మదినాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముగ్గు వెంకటాపురం గ్రామ మహిళా సర్పంచ్ బేబీ స్వరాజ్య లక్ష్మి సీనియర్ నాయకుడు కొండపల్లి రాధాకృష్ణ గ్రామ నాయకులు నానాజీ, గ్రామ పెద్దలు కొండపల్లి అభిమానులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నికలు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాముఖ్యతను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రత్తమ్మ గారు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలు అలవడేలా ఇలాంటి ఎన్నికలు నిర్వహించడం ఎంతో అవసరమని తెలిపారు. భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎన్నికైన విద్యార్థి నాయకులను ప్రధానోపాధ్యాయులు టి. రత్తమ్మ గారు, ఉపాధ్యాయ బృందం అభినందించి, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసే దిశగా విజయవంతంగా సాగింది.

## జమలాపురం బస్ స్టేషన్ అభివృద్ధి చేయండి

♦ సర్పంచ్ నిర్మలా కుమారి



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** మధిర బస్ డిపో పరిధిలోని జమలాపురం బస్ స్టేషన్ ను అభివృద్ధి చేయాలని గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మల కుమారి డిఎం దేవరాజును కోరారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా డిఎం జ మలాపురం వచ్చిన సందర్భంగా సర్పంచ్ నిర్మల కుమారి బస్టాండ్ సమస్యలను వివరించారు. జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు బస్సు సౌకర్యాలు లేకపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. జిల్లాలో అతి ముఖ్యమైన దేవాలయంగా పేరు ప్రేక్షకులు ఉన్న జమలాపురం రావడానికి భక్తులకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు గురవుతున్నారని సర్పంచ్ డిఎం దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్ శుభ్రత కోసం, ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్ లో ఉన్నటువంటి చెట్లు జెసిబి తో క్లీన్ చేయించిన విషయం తెలిపారు. అదేవిధంగా బస్టాండు అభివృద్ధి చేసి జమలాపురం వచ్చే ప్రతి బస్సు స్టాండ్ ఆవరణలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిఎం ని కోరారు.బస్ స్టేషన్ కు త్రాగునీరు,విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం గురించి,బస్టాండ్కు రంగులు వేయుట గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు చేస్తామని,పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బస్ స్టేషన్ లోకి బస్సులు వచ్చి పోయే విధంగా సదుపాయాల గురించి జమలాపురం ఆలయానికి ప్రతినిత్యం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పోవడం జరుగుతున్నదని కావున (1) మధిర నుండి జమలాపురం, మైలవరం మీదగా నూజివీడు( 2) జమలాపురం మైలవరం విజయవాడ బస్సుల సంఖ్యను కూడా పెంచమని డిఎం ని కోరారు.ప్రతి బస్సు జమలాపురం బస్టాండ్లోకి వచ్చే విధంగా చర్యలు చేపడతామని డిఎం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడిసి కె వెంకటరెడ్డి,ఆర్ హెచ్ సి పూర్ణచంద్రరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు వ్యవసాయ కూలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల పిలుపు



**కల్లూరు జులై 26 ప్రజాజ్యోతి** రైతులు వ్యవసాయ కూలీలు పారిశ్రామిక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దోమతోటి పుల్లయ్య సామినేని హనుమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయినా రైతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్నారని పేర్కొన్నారు. వ్యవసాయ వ్యయాలు పెరిగిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని ఎరువులు విత్తనాలు పురుగుమందుల ధరలు పెరగడంతో సాగు భారం మరింత అధికమైందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న తగిన నష్టపరిహారం అందక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి లభించడం లేదని కనీస వేతనాలు అమలు సక్రమంగా జరగడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య బట్టు నరసింహారావు పర్వేజ్ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు భాను శ్రీకర్ బీరవల్లి మోహన్ రావు షేక్ హుస్సేన్ మండేపూడి చిన్న నరసయ్య వల్లబోయిన రామనాథం మనమంటి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సమస్యల పై నేడు ఛలో పార్లమెంట్

- జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా ఢిల్లీకి బయలుదేరిన టీడ బ్ల్యూజేఎఫ్ నేతలు,జర్నలిస్టులు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**
కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై నేడు తెలంగాణ జర్నలిస్టులు ఛలో పార్లమెంట్ కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా నేడు ఢిల్లీలోని పార్లమెంట్ జంతర్ మంతర్ వద్ద ఒకరోజు ధర్నా చేయడానికి ఏర్పాట్లు జరిగాయి.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు ఇప్పటికే ఢిల్లీకి బయలుదేరారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి,రంగారెడ్డి,వరంగల్,ఖమ్మం,కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శనివారం ఢిల్లీ బయలుదేరారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,తాము తొలిసారిగా ఛలో పార్లమెంట్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలు జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళు కొనసాగించిన రైల్వే రాయితీ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసింది. దీనిని పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు. ఇబ్బందులకు గురవుతున్నారు.జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.దేశ వ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మీడియా కమీషన్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.నేషనల్ పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టాలి.దేశవ్యాప్తంగా రిటైర్డ్,సీనియర్ జర్నలిస్టులు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేక పోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదు. అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.జర్నలిస్టుల రక్షణ చట్టం చేయాలి.దేశంలోని అనేక రాష్ట్రాలలో జర్నలిస్టుల పై దాడులు,హత్యలు,అక్రమ కేసుల బనాయింపు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి.వీటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలి,ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత లేకపోవడం వల్ల అనేక సమస్యలు, అనార్థాలు ఎదురవుతున్నాయి. వెంటనే ఈ మీడియాలకు చట్టబద్ధత కల్పించాలి.ఇళ్ళస్థలాల పై సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలి.పాత్రికేయ సంఘాలకు,జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి,దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివెళుతున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య,ప్, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లతో పాటు అనేకమంది నాయకులు,సభ్యులు బయలుదేరి వెళ్ళారు.

## మాజీ ఎంపీ రేణుక చౌదరీ నిధులతో సిసి రోడ్ శంకుస్థాపన



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని రేమిడిచర్ల గ్రామంలో శనివారం సర్పంచ్ కాపు వరప్రసాద్ రావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావు సామినేని చెన్నకేశవరావు అధ్యక్షతన మాజీ ఎంపీ రేణుక చౌదరి 5 లక్షలు ఎంపీ నిధులతో సీసీ రోడ్లుకు పి ఎ పుల్లయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ దివ్య కృష్ణయ్య జిల్లా కాంగ్రెస్ నాయకులు బుగ్గవరపు వెంకటేశ్వరరావు మాజీ మార్కెట్ యార్డ్ డిసిసి కార్యదర్శి కర్లపూడి అప్పారావు ఆలస్యం నరసయ్య మండల నాయకులు జల్లేపల్లి ప్రసాద్ గంగినేని శ్యాంప్రసాద్ బాద సత్యనారాయణ రెడ్డి ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాంబ శివరావు చింత నిప్పుల శ్రీనివాసరావు కొండపాటి భుజంగరావు స్వామినేని మురళి సామినేని నాగేశ్వరరావు రవి విజయ్ తదితరులు పాల్గొని ఈ గ్రామ అభివృద్ధికి సహాయం చేస్తున్న మాజీ కేంద్ర మంత్రివర్యులు ఎంపీ రేణుకా చౌదరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

## ఎల్ నినో పట్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల పై దృష్టి సారించండి

- ... ఏ.ఎం.సి దోమ ఆనంద్




**సత్తుపల్లి జూలై25(ప్రజా జ్యోతి)**ఎల్ నినో ప్రభావం పట్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపి, ఆరుతడి పంటలను మాత్రమే పండించుకోవాలని,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు రాకపోవటం పట్ల, భూగర్బ జలాలు అడుగంటి పోవటంతో, రైతులు ఆరుతడి పంటలు వేయాలని, వర్షాధార పంటలపై ఆధారపడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదని, తక్కువ నీటిని ఉపయోగించే పంటలను వేయాలని, దీని ద్వారా పంట త్వరగా చేతికి రావడం, రైతు లబ్ధి పొందటం జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకూడదని, వ్యవసాయ అధికారుల సలహాలు సూచనల తోటి పంటలు వేసి, అభివృద్ధి చెందాలని కోరారు. నీటిని కూడా వృధా కాకుండా పొదుపుగా వాడుకోవాలని, కరువు పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఉన్నాయి కాబట్టి, మంచి పంటలను పండించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. వ్యవసాయ అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు కాబట్టి, వారి సూచనలు సలహాలతో ముందుకు సాగాలని తెలిపినారు.

## సిపిఎం పార్టీ శాఖ సమావేశం



**ముదిగొండ జూలై 25(ప్రజా జ్యోతి )**ముదిగొండ మండలం పెద్ద మండవ గ్రామంలో సిపిఎం పార్టీ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి విధానాలకి వ్యతిరేకంగా శాఖ తీర్మానం చేయడం జరిగింది .కేంద్ర ప్రభుత్వం పేపర్లు లీ కేజీ వ్యవహారంలో పోరాటం చేస్తున్న విద్యార్థులకు అండగా సంఘీభావం తెలియజేయడం జరిగింది. వామ పక్ష విద్యార్థి సంఘాల పిలుపుమేరకు పెద్ద మండవ గ్రామంలో అన్ని పాఠశాలలను బంద్ చేయడం జరిగినది.సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు. మండల కమిటీ సభ్యులు. కందిమల్ల తిరుపతి. మాదారపు సత్యనారాయణ. అబ్బూరి బుజ్జిబాబు. ఎడ్లపల్లి నరసింహారావు. కుక్కల బాబు. సరికొండ సత్యం రాజు. అబ్బూరి వెంకటేశ్వర్లు.అందరూ కలిసి విద్యార్థులకు మద్దతుగా గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలలో బంద్ చేయడం జరిగింది.

## ముగిసిన మొదటి విడత టీచర్ల ట్రైనింగ్

- జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్.





**నేలకొండపల్లి, జులై 25 ప్రజా జ్యోతి:** మండల కేంద్రంలో మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మూడో రోజు జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్కుమార్ గణితం రేమిడిమేషన్ తరగతులు బోధించారు. గణితంలో మరింత పట్టు సాధించేలా వివిధ అంశాల పై ఉపాధ్యాయులకు తరగతులు బోధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. ఎస్ఎల్యం, టీఎల్యం, ఐఎల్యం ల వలన జరిగే ఉపయోగాలను వివరించారు. పాఠశాలలో ప్రతీ రోజు ఒక గంట రిమీడియేషన్ కార్యక్రమం ను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రతీ తరగతి లో ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేసి పాఠశాలల బలోపేతం లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఆర్పీ లు మాదవ్, స్వామి, శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం. రమేష్, ఉపాధ్యాయులు టి. వెంగళరావు, తొర్తి సురేష్, రామరావు, తొర్తి గురవయ్య, మారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బ్యాగుల వితరణ

- గుడుపూడి తిరుమలరావు.



**కారేపల్లి, జూలై 25, ప్రజా జ్యోతి:**వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ పుట్టినరోజు సందర్భంగా శనివారం సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నారై గుడిపూడి తిరుమలరావు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ స్కూలు బ్యాగులను వితరణగా తిరుమలరావు అందించారు.ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ, వైరా శాసనసభ్యులు ప్రజల మనిషి రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఇంకా ప్రజాసేవలో నిమగ్నమై ఉన్నత పదవులు సాధించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూసం ఎల్లయ్య, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరావు, కార్యదర్శి కె.అనూష పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనూష, జిపిఓ వెంకటేశ్వర్లు, వీఆర్ఏ నూకల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు మూడు శ్రీనివాస్ , భూక్యా రమేష్, గ్రామస్తులు జక్కుల కుమార్, ఓరికొర్ల వీరభద్రం, సామినేని తిరుపతి రావు, తాళ్లూరి అప్పారావు, చెరుకూరి రామారావు, మందా రామారావు, చెరుకూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## వినియోగదారుల నమ్మకానికి చిరునామా 'కార్తికేయ సెల్ పాయింట్'!

- ప్రొప్రైటర్ బొజ్జ వినోద్ కుమార్
- మొబైల్ ప్రేమికులకు పండగే పండగ రీజనబుల్ ధరలు,నాణ్యమైన సేవలకు కేరాఫ్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక పాత మున్సిపాలిటీ 20వ లైన్‌లో నాణ్యమైన సేవలు,వినియోగదారుల నమ్మకమే పునాదిగా దూసుకుపోతోంది 'కార్తికేయ సెల్ పాయింట్'. నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి అయిన తరుణంలో, ఖాతాదారులకు అత్యుత్తమ మోడల్స్,రీజనబుల్ ధరల్లో అందిస్తూ ఈ ప్రాంతంలోనే ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.

**కార్తికేయ సెల్ పాయింట్ ప్రత్యేకతలు – గొప్పతనం:**
అన్ని ప్రముఖ బ్రాండ్లు ఒకే చోట: ప్రముఖ కంపెనీల స్మార్ట్‌ఫోన్లు సాంసంగ్ , ఒన్ప్లస్ , వివో , ఒప్పో , రియల్మ్ , రెడ్మీ మొదలైనవి అన్నీ అందుబాటు ధరల్లో లభిస్తాయి.

**భారీ ఆఫర్లు, డిస్కౌంట్లు:** మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు, పండుగలు, ప్రత్యేక రోజుల్లో అద్భుతమైన ఆఫర్లు,క్యాష్‌బ్యాక్‌లు,గిఫ్ట్‌లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది.

**సులభమైన ఈ ఎం ఐ సౌకర్యం:** జీరో డౌన్ పేమెంట్, తక్కువ వడ్డీతో సులభమైన ఫైనాన్స్ బజాజ్ , టీవీఎస్ , హోమ్ క్రెడిట్ మొదలైనవి సదుపాయం కలదు.

**క్విక్ అండ్ బెస్ట్ మొబైల్ సర్వీసింగ్:** నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లతో ఎలాంటి స్మార్ట్‌ఫోన్ సమస్యనైనా వేగంగా, నమ్మకంగా రిపేర్ చేసి ఇస్తారు.

**లేటెస్ట్ యాక్సెసరీస్:** ట్రెండీ మొబైల్ పౌచ్‌లు, టెంపర్డ్ గ్లాస్‌లు, బ్లూటూత్ హెడ్‌ఫోన్లు,స్మార్ట్‌వాచ్‌లు, పవర్ బ్యాంక్‌లు సరసమైన ధరలకే లభిస్తాయి.సంతోషకరమైన వినియోగదారుడే మన విజయరహస్యం కేవలం వ్యాపారమే కాకుండా,కస్టమర్ సంతృప్తికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ,నాణ్యమైన ప్రోడక్ట్స్ మాత్రమే అందించడమే కార్తికేయ సెల్ పాయింట్ ప్రత్యేకత."

**చిరునామా:** కార్తికేయ సెల్ పాయింట్, సెల్ నెంబర్ 6281593606, పాత మున్సిపాలిటీ ఎదురుగా, ఖమ్మం

## మల్లన్నపాలెం గ్రామంలో నూతన వివో బిల్డింగ్ శంకు స్థాపన



**ముదిగొండ జూలై 25(ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నూతన డ్వాక్రా మహిళ సమైక్య భవనమునకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య, మండల కాంగ్రెస్ నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్,మల్లెల అజయ్,మాజీ సర్పంచ్ మండల నాయకులు చిలకల రామకృష్ణ,గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ నాగ హుస్సేన్ ఖాన్, ఉపాధ్యక్షులు ఏనబోయిన ముత్తయ్య ,గ్రామ సర్పంచ్ కోలేటి వెంకటేశ్వర్లు,ఉప సర్పంచ్ పరిటాల లింగయ్య, పంచాయతీ రాజ్ ఏ ఈ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ,మాజీ సర్పంచులు కోలేటి నాగేశ్వరరావు, మాజీ నీటి సంఘాల అధ్యక్షులు నంజాల నరసింహారావు, మాజీ సర్పంచ్ చిర్రా వెంకటేశ్వర్లు, దేవదాయ చైర్మన్ కోలేటి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ షేక్ రహింతుల్లా, నాయకులు కోలేటి జానకిరామ్,నోముల నాగేశ్వరరావు,ఎలగాల శ్రీనివాసరావు,చిలకల ఉపేందర్ ,కోలేటి నాగయ్య, బాబు, షేక్ నాగుల్ మీరు, షేక్ ఖాజా,పరిటాల రమేష్, గ్రామ దీపిక షేక్ హుస్సేన్ బి (ఉష), వివో అధ్యక్షురాలు నెల్లూరి శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ రొయ్యల భద్రయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే పశుగ్రాసాలు పండించండి

- అదనపు ఆదాయం గడించండి
- డాక్టర్ షఫీయా






**వేంసూరు జులై 25 ప్రజాజ్యోతి** జిల్లా మంత్రివర్యులు మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావం – వాతావరణ పరిస్థితులకు అనుగుణంగావ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు (ఇరిగేషన్, ఉద్యానవన శాఖ, ప్లానింగ్ శాఖ, విద్యుత్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, భూగర్భ జల శాఖ,డి ఆర్ డి ఒ పశుసంవర్ధక శాఖ) శనివారం గ్రామాలలో (భరణిపాడు, మర్లపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం) అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 1 డాక్టర్ .షఫియా వి ఏ ఎస్ గారు మాట్లాడుతూ ఇలాంటి వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసాలైన సూపర్ నేపియర్, హైబ్రిడ్ జొన్న గడ్డి, స్టైలో, లూసర్న్ మరియు గినియా గడ్డి పంటలు అతి తక్కువ నీటితో మంచి దిగుబడుల్నిస్తాయి. అలానే ఈ పచ్చి గడ్డిని సైలెజ్ తయారీకి మరియు యూరియాతో కలిపిన సైలెజ్ తయారుచేయడం వలన భవిష్యత్తులో పచ్చి మేత పశువులకు అందుబాటులో ఉండి పాల దిగుబడి తగ్గకుండా ఉంటుంది. సుబాబుల్ మరియు మునగాకును కూడా పశుగ్రాసంగా ఉపయోగించవచ్చు. పశువుల ఆరోగ్య సంరక్షణ వ్యాధుల నివారణకు టీకాలు సమయానికి వేయించాలని, అలానే తప్పకుండా నత్తల మందు తాగించాలని తెలపడం జరిగింది .2.నీటిపారుదల శాఖ ఏ ఈ ఈ శ్రీనివాసరెడ్డి, గఫర్ పాల్గొని ఎన్ ఎస్ పి కెనాల్, చెరువులు మరియు బోర్ల కింద అందుబాటులో ఉన్న నీటిని ఆధారంగా ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం లంకాసాగర్ లోని నీటిని త్రాగు అవసరాలకు మాత్రమే వినియోగించడం జరుగుతుందని ఎన్ ఎస్ పి కాలువకు ఎలాంటి గండ్లు కొట్టగూడని తెలిపారు.3. వ్యవసాయ అధికారులు మరియుఏ ఈ ఒ లు ఇప్పటి వరకు ఉన్న పంటల పరిస్థితి మరియు వరికి బదులుగా వర్షపాతం మరియు సాగునీరు లభ్యత ప్రకారం వరిలో అయితే తక్కువ కాలపరిమితి రకాలు, అలానే ఆరుతడి పంటలు పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, నువ్వులు వేసుకోవాలని, ప్రస్తుతం ఉన్నటువంటి పంటలను రక్షించుకోవడం, మరియు జలసిరి పథకం కింద భూగర్భ జలాలను వృద్ధి కోసం ఉచితంగా పంటపొలాలు నిర్మించుకోవాలని తెలపడం జరిగింది.ప్రత్యామ్నాయ పంటల సాగు విత్తనాల అందుబాటు మరియు ఎరువుల అందుబాటు గురించి చెప్పడం జరిగింది.4.ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు ప్రభుత్వం రైతులకు అందించే ఉచిత నాణ్యమైన కరెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, ఆటో స్టార్టర్లు తీసివేయడం ద్వారా కరెంట్ పొదుపుచేసుకోవచ్చని, ఆరుతడి పంటల వలన కరెంట్ వాడకం తగ్గుతుందని తెలపడం జరిగింది. 5.ఉపాధి హామీ శాఖ వారు పంట కుంటలు మరియు సోక్ పిట్ల నిర్మాణాలకు 100% రాయితీ ఉం టుందని, ఆసక్తి గలవారు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం మరియు జాబ్ కార్డు వివరాలు ఆయా ఏ ఈ ఒ లకు గానీ,ఫెప్ ఒ లకు గానీ అందించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమానికి 4గ్రామాల సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ,పంచాయతీ సెక్రటరీలు, ఇరిగేషన్ ఏ ఈ ఈ శ్రీనివాసరెడ్డి, గఫర్ షఫియా ఏ ఈ ఒ లు స్వాతి, రీమా, సందీప్,ఎచ్ ఈ ఒ రాజేశ్వరరావు, లైన్ ఇన్స్పెక్టర్లు ఎల్లయ్య,ఫెప్ ఏ లు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మోటారు కాలిందని మందలించినందుకు తల్లి పై దాడి చేసి గాయపరిచిన కొడుకు



**నేలకొండపల్లి, జూలై 25 ప్రజా జ్యోతి :** పొలం లో మోటారు కాలిందని... తల్లి కుమారుడును మందలించిందని కొడుకు దాడి చేసి గాయపరిచాడు... స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగాపురం తండా లో వ్యవసాయం పొలం వద్ద ఉన్న మోటారు కాలిపోయింది. దీంతో భూక్యా సరోజ అనే మహిళ కుమారుడును మందలించింది. మోటారు కాలే వరకు ఏమీ చేస్తున్నారని... దీంతో ఆగ్రహించిన కుమారుడు తల్లి పై దారుణంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడింది.స్థానికులు 108 కు సమాచారం ఇవ్వటంతో నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో ప్రధమ చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం . తరలించారు.

## టీమ్ ను గెలిపించిన సాయిస్ఫూర్తి విద్యార్థి శ్రాగ్వి



**సత్తుపల్లి జూలై25(ప్రజా జ్యోతి )**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ డి ఏ వి పాఠశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ చెస్ పోటీలలో సత్తుపల్లి మండలం బి గంగారం లో గల సాయిస్ఫూర్తి డిఏవి స్కూల్ విద్యార్థులు శ్రాగ్వి, భవ్య, దేదీప్తి, సాత్విక టీం విద్యార్థులు చెస్ గేమ్ లో మొదటి బహుమతి సాధించారు.టీం కెప్టెన్ గా టీమ్ ను గెలిపించిన శ్రాగ్వీను సాయిస్ఫూర్తి డిఏవి స్కూల్ చైర్మన్ దాసరి ప్రభాకర్ రెడ్డి ,ప్రిన్సిపల్ శేష సాయి శ్రీ ,ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శేష సాయి శ్రీ, స్వప్న, కుమార్, రామిశెట్టి తదితర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు బహుమతి సాధించిన శ్రాగ్వీను వారి తల్లిదండ్రులు వినుకొండ వెంకటేశ్వరరావు _ సుజాతలు, పలువురు అభినందించారు

## జగన్నాథపురంలో ఎల్ నినోపై అవగాహన

- సర్పంచ్ తాళ్ళూరి స్వప్న ఆధ్వర్యంలో గ్రామ సభ

**చింతకాని జులై 25ప్రజాజ్యోతి :**మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ పంచాయతీలో ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ,ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు.అధికారులు మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పెసర, మినుములు, కందులు,శనగ,నువ్వులు,జొన్న, సజ్జ,రాగులు వంటి పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు పొందవచ్చని వివరించారు.అలాగే రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని,ప్రతి రైతు తమ బోరు వద్ద ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడుతుందని తెలిపారు. పశువులకు భవిష్యత్తులో మేత కొరత ఏర్పడకుండా ఉండేందుకు జొన్న,జాడు,పశుగడ్డి వంటి మేత పంటలను ముందస్తుగా సాగు చేయాలని, అలాగే అంతర పంటలు (ఇంటర్ క్రాపింగ్) సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని అధికారులు రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున ఉప సర్పంచ్ అలవాల శ్రీదేవి,ఏఈఓ కార్తీక్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సాయి శ్రీధర్, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ రామ్జీ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి విష్ణు, టి ఏ కృష్ణయ్య,గ్రామ కార్యదర్శి చామర్తి కృష్ణమాచారి, వార్డు సభ్యులు తోటకూరి హరీష్, గ్రామ పెద్దలు తాళ్ళూరి రమేష్, మండేపూడి కిషన్ రావు, తన్నీరు పుల్లారావు,సింగ్ కిశోర్, ముల్లంగి కోటయ్య, అలవాల నాగేశ్వరావు,రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# బోనకల్ లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతిపత్రం
- వినతి పత్రం అందజేసిన బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



**బోనకల్, జూలై 25(ప్రజా జ్యోతి ):** బోనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన సోలార్ విద్యుత్‌పై స్థానిక రైతు వేదికలో శనివారం సమీక్ష సమావేశానికి హాజరైన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ కలెక్టర్ ను కలిసి గ్రామంలోని తీవ్రమైన తాగునీటి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ... గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు గ్రామ ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకే వెల్ (ఓపెన్ వెల్) నుంచి నీటిని సరఫరా చేస్తున్నందున నీటి కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. గ్రామంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో కొత్త బోర్‌వెల్‌ను తవ్వించి, దానిని ప్రస్తుతం ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు అనుసంధానం చేయడం ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, బోస్ బొమ్మ సెంటర్ లలో మంచినీటి కొరత ఎక్కువగా ఉన్నదని, అలాగే గత కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా నీటి సమస్య మరింత తీవ్రమైందని, గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి కొత్త బోర్‌వెల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించి స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ జ్యోతి కొండ తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# లోయర్ రవి నాయక్ మృతి న్యాయ వ్యవస్థకు తీరని లోటు

- నర్సింగ్ శ్రీనివాసరావు.



**కారేపల్లి, జూలై 25, ప్రజా జ్యోతి:** సీనియర్ న్యాయవాది ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవి నాయక్ మృతి చాలా బాధాకరమని ఉమ్మడి ఖమ్మం జిల్లా న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది రవి నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శనివారం మృతుడు రవి నాయక్ దశదిన కార్యక్రమంలో సింగరేణి మండలానికి చెందిన ప్రముఖులు పాల్గొని రవి నాయక్ చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రవి నాయక్ తన వద్ద చిన్న వయసులో అడ్వకేట్ గా పనిచేశారని, తనకు తమ్ముడు లాంటివాడని అందరితో కలుపుకొని పోయే రవి చనిపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. గిరిజన కుటుంబంలో పుట్టిన అతను చిన్న వయసులోనే న్యాయవాధిగా వృత్తిని కొనసాగుతూ అంచలంచలుగా ఎదిగి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా చాలా కాలం పాటు పని చేశారని గుర్తు చేశారు. ఇల్లందు, కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో కూడా గిరిజనులతో మమేకమై వారి సమస్యను తన సమస్యగా భావించి న్యాయపరంగా అందరిని న్యాయం చేశారని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి వివిధ కేసుల సమస్యల కోసం రవి నాయక్ ను ఆశ్రయించి వారి కేసుల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశారని గుర్తు చేశారు. రవి నాయక్ చిత్రపటానికి పూలమాల వేస్తూ సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు కంటతడి పెట్టుకున్నారు. తనకు కుడి భుజం లాగున్న రవి నాయక్ మృతి చెందడం చాలా బాధ వేసింది అని మనోవేదన చెందారు. సింగరేణి మండల నాయకులు అజ్మీర వీరన్న మాట్లాడుతూ రవి నాయక్ మృతి న్యాయవ్యవస్థకు తీరని లోటని గిరిజన కుటుంబంలో పెరిగి చిన్న వయసులోనే ఉన్నత స్థాయి ఎదిగిన న్యాయవాది లేని లోటు గిరిజనులకు తీరదని ఆయన పేర్కొన్నారు. చిన్న వయసులో చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమకొండ రమేష్, ఆడప పుల్లారావు, దమ్మలపాటి ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త కాటేపల్లి నవీన్, న్యాయవాది ధారావత్ చందు నాయక్, వాంకుడోత్ విజయ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ఎస్బీఐ 'ఆశ' స్కాలర్షిప్-2026 దరఖాస్తులు ప్రారంభం

- విద్యా సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు



**నేలకొండపల్లి, జూలై 25 ప్రజా జ్యోతి:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ప్లాటినం జూబ్లీ 'ఆశ'స్కాలర్షిప్-20265 అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యా సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ స్కాలర్షిప్ ద్వారా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు రూ. 15,000, డిగ్రీ విద్యార్థులకు రూ. 75,000, పీజీ విద్యార్థులకు రూ.1,50,000, ఐఐటీ విద్యార్థులకు రూ.2,00,000, ఐఐఎం విద్యార్థులకు రూ.5,00,000, వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.2,00,000, అలాగే విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల లోపు ఉన్న విద్యార్థులు భారతీయ ఈ స్కాలర్షిప్కు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ మార్కుల మెమో, ఆధార్ కార్డు, ఫీజు చెల్లించిన రసీదు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్బుక్ ప్రతితో కలిసి సెప్టెంబర్ 4లోపు www.sbifasha scholarship.org వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యాకూబ్ పాషా కోరారు. మరిన్ని వివరాల కోసం 85208 60785 ను సంప్రదించవచ్చని లేదా పై వెబ్సైట్ ను సందర్శించాలని కోరారు.

# సింగరేణి సర్పంచ్ టోనీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**కారేపల్లి, జూలై 25, ప్రజా జ్యోతి:** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పుట్టినరోజు వేడుకలను శనివారం సింగరేణి మండల కేంద్రంలో ఆయన అనుచరులు,అభిమానులు, ప్రజాప్రతినిధులు,యువకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు సైతం నిర్వహించారు.సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరాన్ని ఏర్పాటుచేసి ఎమ్మెల్యే పైన అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ టోనీ మాట్లాడుతూ...వైరా నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ,గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ అహర్నిశలు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పుట్టినరోజున మెగా రక్తదానం శిబిరాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఎంతోమంది తల సేమియా వ్యాధితో,ఇతరత్రా కారణాలతో సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఎమ్మె ల్యే పుట్టినరోజు సందర్భంగా అలాంటి బాధితులకు సహకారం అందించడమే గొప్పవరంగా భావిస్తున్నామని అన్నారు.స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల కాంగ్రెస్ నాయకులు,సర్పంచ్లు,ఉప సర్పంచ్లు,వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి



**నేలకొండపల్లి, జూలై 25 ప్రజా జ్యోతి :** ప్రస్తుత పరిస్థితులలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఆజయ్ తండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ సూచించారు. మండలం లోని ఆజయతండా లో శనివారం రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...వాతావరణం అనుకూలంగా ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని అన్నారు. నీటి శాతం తక్కువగా ఉన్నందున్న రైతులు వరిక బదులు ప్రత్యామ్నయ పంటలను వేసుకోవాలన్నారు. ఆరుతడి పంటలైన పెసర, కంది, మినుము ఇతరత్రా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావం ప్రమాధకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారని పేర్కొన్నారు. కుంటల వలన రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కావునా రైతులు ఈ 'అవకాశం ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులదృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, వార్డు సభ్యులు బాషా, సుశీల, ఉపాధి హామీ పధకం క్షేత్ర సహాయకులు వెంకటేశ్వర్లు, వీఓ అధ్యక్షురాలు సక్కుబాయి, గ్రామదీపిక కవిత, ఆశా వర్కర్ విజయ తదితరులు. పాల్గొన్నారు.

# సమిష్టితత్వాన్ని ప్రోత్సహించటం ఎఫ్.పీ.వో లక్ష్యం

- నేరుగా విత్తే వరితో అధిక ఫలం.
- కారేపల్లిలో ఎఫ్పీవో అవగాహన సదస్సులో అధికారులు.

**కారేపల్లి, జూలై 25, ప్రజా జ్యోతి:** సమిష్టి తత్వాన్ని ప్రోత్సహించటమే రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పీ.వో) లక్ష్యమని కోఆపరేటీవ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ, కారేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు సంఘ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య మాట్లాడుతూ సాంకేతికను అందుకోవటంతో చిన్న సన్నకారు రైతులు వెనకబడటం మూలంగా ఉత్పత్తి తగ్గి పెట్టుబడు పెరుగుతున్నాయన్నారు. సాంకేతికను అందించటం కోసం ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో రూ.2వేలు కట్టి సభ్యత్వం తీసుకున్న రైతులకు ప్రభుత్వం మరో రూ.2వేలు వాటాగా కలుపుతుందన్నారు. వీటితో రైతులకు అవసరమైన సేవలను రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా అందించటం జరుగుతుందన్నారు. ఎఫ్.పీ.వో లో 750 మంది సభ్యులు చేర్చుకునే అవకాశం ఉందన్నారు. కారేపల్లి సోసైటీలో 400 మంది సభ్యులుగా చేరి ఉన్నారని అది పని ప్రారంభించిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ వరిని నేరుగా విత్తే పద్దతి ద్వారా ఖర్చు తక్కువ, నీటి అవసరం తక్కువతో పాటు అధిక ఫలసాయం వస్తుందన్నారు. దీనిలో పంట కాలం 15 రోజు తగ్గుతుందన్నారు.రైతులుతమ భూముల షోషకాల స్థాయిని పరిశీలించి ఎరువులవాడకం చేయాలన్నారు. దానికి తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం భూసార పరీక్షల చేసే విధానాన్ని వివరించి కిట్ లను రైతులకు అందజేశారు. సమిష్టితత్వంపైరైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్ పర్ట్ చావా అరుంధతి, సీఈవో బొల్లు హనుంతరావు, దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ, సర్పంచ్ లు అంగోత్ మత్రు, ఈసాల వెంకటేశ్వరరావు, భూక్య పద్మ, భూక్య రంజిత్ కుమార్, పూసం రామారావు, సోసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, డేగల ఉపేందర్, రైతు ప్రతినిధులు బానోత్ రాంమ్మూర్తి, కడియాల సుధాకర్, సురేందర్ మనియర్, కిలారి అప్పారావు, సూరపురెడ్డి విష్ణవర్ధన్ రెడ్డి, పెద్దబోయిన ఉమాశంకర్, ఆదెర్ల రాములు, అడపా పుల్లారావు, అజ్మీర నరేష్, కాసాని లక్ష్మినారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు, పెర్ని వెంకటేశ్వర్లు, వడ్డె అనంతయ్య, ఈసాల ఛాయా దేవి, నాగండ్ల జగన్, అజ్మీర ఈర్యా, చాగంటి వెంకటేశ్వర్లు, అజ్మీర హేమ్లా, బట్టు సంగయ్య,ధళ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జలబిందెల కార్యక్రమం

- ముత్యాలమ్మ తల్లి, గ్రామ బొడ్రాయిలకు ఘనంగా పూజలు



**చింతకాని జులై 25ప్రజాజ్యోతి :**వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగులవంచ గ్రామంలో గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి – శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి, గ్రామ బొడ్రాయిలకు ప్రత్యేక పూజలు, జలబిందెల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గ్రామ మహిళలు తలపై జలకలశాలను మోసుకుంటూ డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధుల గుండా భక్తి శోభా యాత్ర నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామానికి సకాలంలో వర్షాలు కురవాలని, చెరువులు,కుంటలు నిండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల జీవితాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని సామూహిక పూజలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి – శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని కోరుకుంటూ సాంప్రదాయ జలబిందెల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు,గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వర్ష భవ పరిస్థితుల్లో రైతుల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

- గ్రామ సభలో సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి.
- మెట్ట పంటలు, నీటి సంరక్షణపై రైతులకు కీలక సూచనలు





**నెలకొండపల్లి, జులై 25 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని మంగాపురం గ్రామ పంచాయతీలో ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ధీరావత్ అశోకరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ,ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు.అధికారులు మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పెసర, మినుములు, కందులు,శనగ,నువ్వులు,జొన్న, సజ్జ,రాగులు వంటి పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు పొందవచ్చని వివరించారు.అలాగే రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని,ప్రతి రైతు తమ బోరు వద్ద ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగేందుకుదోహదపడుతుందని తెలిపారు. పశువులకు భవిష్యత్తులో మేత కొరత ఏర్పడకుండా ఉండేందుకు జొన్న,జాడు,పశుగడ్డి వంటి మేత పంటలను ముందస్తుగా సాగు చేయాలని, అలాగే అంతర పంటలు (ఇంటర్ క్రాపింగ్ ) సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని అధికారులు రైతులకు వివరించారు.ఈ మంత్రి చొరవతో గ్రామంలో సిసి రోడ్లు పూర్తి చేసామని అన్నారు . సైడ్ డ్రైనేజీలు పూర్తి చేస్తామని, వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సైడ్ డ్రైనేజీలు పూర్తి చేస్తామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహం ఇప్పించే బాధ్యత తనదని అన్నారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాధాకృష్ణ, మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, భూక్య సీతా నాయక్, గోబ్రియా నాయక్, తేజావత్ కోటేశ్వరావు, రిటైర్మెంట్ కండక్టర్ రమణ, గ్రామ ప్రజలు, ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ పుట్టినరోజు వేడుకలు



- రక్తదానం అన్నదానం శిబిరాలు నిర్వహణ

**కారేపల్లి, జూలై 25, ప్రజా జ్యోతి:** వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయకులు పుట్టినరోజు వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, సింగరేణి సర్పంచ్ మేదర వీర ప్రతాప్ తోని ల ఆధ్వర్యంలో శనివారం సింగరేణి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్ హాజరైనారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మొదట రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం కారేపల్లి పురవీధులలో ఎమ్మెల్యే అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు యూనిఫాములను విగ్నేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో అందరివాడిగా, పేదల పెన్నిధిగా పేరుందిన మన వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఇంకా ఉన్నత పదవులు సాధించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడాలని





వారు దీవించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,నాయకులు పరస పట్టాభి రామారావు, బానోతు దేవులనాయక్, పెద్దబోయిన ఉమా శంకర్ సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, అడప పుల్లారావు, కడియాల సుధాకర్, విష్ణువర్ధన్ రెడ్డి, డేగల ఉపేందర్, గుడిపూడి తిరుమలరా వు,సర్పంచులు బానోతు హిరాలాల్, దండు ప్రవీణు, పూ సం ఎల్లయ్య, మూతి వీరస్వామి,ఎస్ ఎస్కే యాబలి, గూగులోతు భీముడు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పొలాల్లో విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించండి

**బోనకల్, జూలై 25 (ప్రజా జ్యోతి ):**
మండలం లో సుబాబులు, ఆయిల్ పా మ్ సాగు చేస్తున్న రై తుల పంట పొలాల మధ్యలో ఉన్న వి ద్యుత్ వైర్ల తో రైతులకు తీవ్రంగా ఇబ్బందులు జరుగుతున్నదని మండల సిపిఎం నాయకులు శనివారం మండల కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయంలో వచ్చిన విద్యుత్ సి యం డి వరుణ్ రెడ్డిని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పొలాల మధ్యలో ఉన్న విద్యుత్ వైర్ల గురించి నాయకులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రైతుల పొలాల మధ్యలో విద్యుత్ వైర్లు ఉండటం వలన రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగి ప్రమాదం జరిగే సూచనలు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వెంటనే విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సీఎం డి వెంటనే స్పందించి వైరు కు స్లీవ్ కు టెండర్లు పిలిచి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సీఎండీని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు చేడే వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, రావినూతల గ్రామ ఉపసర్పంచ్ దొండపాటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# తోపుడుబండితో పేద కుటుంబానికి కొత్త జీవన ఉపాధి



**కల్లూరు, జులై 25 : ప్రజా జ్యోతి** ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద కుటుంబానికి స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచింది. కల్లూరు మున్సిపాలిటీకి చెందిన ఉలాస నాగమణి కుటుంబానికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో రూ. 20 వేల విలువైన కూరగాయల తోపుడు బండిని అందజేసింది. ఉలాస నాగమణి ఆమె భర్త నరసింహారావు రోజువారి కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. భర్త అనారోగ్యంతో బాధపడుతుంటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వారికి ఎలాంటి ఆస్తులు లేకపోగా ఇద్దరు కుమార్తెలు కల్పనా జ్యోత్స్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను గుర్తించిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు దాతల సహకారంతో నాగమణికి రూ 20వేల విలువైన కూరగాయల తోపుడుబండిని అందించి స్వయం ఉపాధికి చే యూతనిచ్చారు. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అవసరమైన వారికి అం డగా నిలిచి వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చే యడం సంస్థ ల క్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, మర్రెల వెంకటేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, ఉబ్బన వేణుబాబు, షేక్ ముజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్..!



**నేలకొండపల్లి, జులై 25 ప్రజా జ్యోతి:**జాతీయ రహదారిని ఆనుకొని నేలకొండపల్లి కూసుమంచి రహదారి పక్కనే సుమారు రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి మండల రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.ఇంతటి విలువైన ఈ భూమిపై కొంతమంది రియల్ బ్రోకర్ల కన్ను పడి ఏకంగా ప్లాట్లుగా చేసి అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విషయం పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటికి తెలిసిన వెంటనే రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్ హుటాహుటిన రియల్టర్లు చెరపట్టిన ప్రభుత్వ భూమిని ఇటీవల పరిశీలించారు. మొత్తం రికార్డులు తిరగ చూసిన ఆయన ఆక్రమణ జరిగిందనే వాస్తవాన్ని గ్రహించి సమగ్ర సర్వేకు ఆదేశించారు.దీంతో తహసీల్దార్ రాంప్రసాద్ తన సిబ్బందితో కలిసి గత రెండు రోజులుగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. నేలకొండపల్లిలోని సింగారెడ్డి పాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 159/1లోని 25 కుంటల భూమిలో జాతీయ రహదారి భూసేకరణలో పోగా మిగిలిన విస్తీర్ణాన్ని హద్దులు పాతి ఫెన్సింగ్ వేశారు. గతంలో ఈ భూమిని మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టుల గృహ నిర్మాణ అవసరాల కోసం కేటాయించగా, మరల జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కోసం ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.అంతేకాకుండా జాతీయ రహదారి కోసం సేకరించిన మరో 7 కుంటల భూమితో పాటు, 159/1లో మరో 5.5 కుంటల భూమి కూడా ఇంకా రియల్టర్ల కబంధ హస్తాలలోనే ఉన్నట్లు కూడా అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఈ విషయమై జాతీయ రహదారి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా రియల్టర్లు అత్యాశతో ఎక్కడో ఉన్న సర్వే నంబర్లను ప్రభుత్వ భూమిలో చూపించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించిన విషయాన్ని కూడా తెలుసుకుని సమగ్ర విచారణ చేస్తామని హామీనిచ్చారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురైనట్లు సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని ఆయన కోరారు.